
సాక్షి
నిజామాబాద్
మంగళవారం ; 4 ; మార్చి ; 2025





పంటలు గట్టెక్కేనా..?

నిజాంసాగర్ ప్రాజెక్టు చివరాయకట్టుకు నీరందడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
38.1 /17.4

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయి. ఉక్కపోతగా ఉంటుంది.

పరిష్కారం లేని ప్రజావాణి!

ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి ఫలితం ఇవ్వడం లేదనే అభిప్రాయం సర్వత్రావ్యక్తమవుతోంది. ఒక్కో అర్జీదారు పదులసార్లు కలెక్టరేట్ చుట్టూ తిరుగుతూనే ఉన్నా వారి సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడం 'ప్రజావాణి' పనితీరును ఎత్తి చూపుతోంది. వ్యక్తిగత ఫిర్యాదులను పక్కన పెడితే.. సామాజిక అంశాలపై అందుతున్న ఫిర్యాదులూ పరిష్కారానికి నోచుకోవడం లేదు.



ఫిర్యాదు చేస్తున్న ఘన్‌పూర్ మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థులు

- ఎన్నిసార్లు అర్జీలు ఇచ్చినా సమస్యలు యథాతథం
- తక్షణ పరిష్కారంపై యంత్రాంగం నిర్లక్ష్యం
- సామాజిక సమస్యల పరిష్కారాన్నీ పట్టించుకోని వైనం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : గ్రామం, మండలం , డివిజన్ స్థాయిలను దాటి కలెక్టరేట్ వరకు సామాన్యులు తమ సమస్యలను విన్నవించుకుంటున్నారు. అయితే కలెక్టరేట్ వరకు సమస్యలను తీసుకొచ్చినప్పటికీ పరిష్కారం దిశగా ఒక్క అడుగూ ముందుకు పడని అర్జీలే ఎక్కువగా ఉంటున్నాయి. దీంతో ఇంకెక్కడికి వెళ్లాలో తెలియక బాధితులు ఇదే కలెక్టరేట్ చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఇలా తిరుగుతున్నవారిలో పేదలు, నిరక్షరాస్యుల నుంచి విద్యాధికులు సైతం అధికంగా ఉంటున్నారు. కలెక్టరేట్ నుంచి ఆయా విభాగాలకు ఎండార్స్ చేసిన సమస్యల విషయమై యంత్రాంగం ఏమాత్రం పట్టింపు లేకుండా వ్యవహరిస్తోందని, ఈ అంశాలపై సమీక్ష ఉండకపోవడంతో పరిష్కారానికి నోచుకోవడం లేదని సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు దిక్కుతోచక కన్నీరు పెడుతున్నారు. ఇక కలెక్టరేట్‌లో ప్రజావాణికి వచ్చే సమస్యల్లో సామాజిక అంశాలైన చెరువులు, ప్రభుత్వ భూముల కబ్జాలు, ఇతర ప్రజోపయోగ అర్జీలు అనేకసార్లు వస్తున్నప్పటికీ పట్టింపు లేని పరిస్థితి. ప్రజలకు పాలన మరింత చేరువ చేసి సమస్యలను వేగంగా పరిష్కారించేందుకు చిన్న జిల్లాలు, మండలాలు, గ్రామాలు విభజన చేసినప్పటికీ ఫలితం లేదని సామాన్యులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా సోమవారం 'సాక్షి' పరిశీలనలో ప్రజావాణికి వచ్చిన అర్జీల్లో కొన్ని..

డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌లోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలుర జూనియర్ కళాశాలలో తాము అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని, అక్కడ చదువుతున్న కొందరు విద్యార్థులు తరగతులు జరుగుతున్న సమయంలో గోడ దూకి వచ్చి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తమకు ఆహారం నాణ్యత లేకుండా పెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సెలవులకు ఇళ్లకు వెళ్లి తిరిగి ఒక్కరోజు ఆలస్యంగా వస్తే రూ.500 జరిమానా పేరిట వసూలు చేస్తున్నారని తెలిపారు. కెమిస్ట్రీ లెక్చరర్ సిలబస్‌ను సక్రమంగా బోధించడం లేదని, పైగా అధికంగా సెలవులు పెడుతున్నట్లు పేర్కొన్నారు. ఇంకా రెండు చాప్టర్లు బోధించలేదని వివరించారు. దీంతో బోర్డు ఎగ్జామ్స్‌లో ఫెయిల్ అవుతామనే భయం నెలకొందన్నారు. తమ సమస్యల విషయమై వాటి పరిష్కారం కోసం తమ పక్షాన మాట్లాడిన ఇంగ్లిష్ లెక్చరర్‌ను ప్రిన్సిపల్ బదిలీ చేయించినట్లు ఫిర్యాదులో వివరించారు.

పోలీసుల నుంచి ప్రాణహాని

- ప్రజావాణిలో వెల్లువెత్తిన ఫిర్యాదులు
- కొడుకు, కోడలు పట్టించుకోవడం లేదు.. బిచ్చమెత్తుకుంటున్నానని ఓ తల్లి ఆవేదన
- సమస్యల పరిష్కారానికి ఆదేశించిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న రెంజల్ మండలం దూపల్లికి చెందిన భాగ్య

నిజామాబాద్‌అర్బన్ /ఎడపల్లి(బోధన్): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో పోలీసులపైనే ఫిర్యాదులు అందాయి. నిజామాబాద్ నగరంలోని బడాబజార్‌కు చెందిన హరీశ్ తన ఫిర్యాదులో పోలీసుల నుంచి ప్రాణహాని ఉందని పేర్కొన్నారు. సీసీఆర్‌బీ సీఐ సతీశ్, ఐదో టౌన్ ఎస్సై గంగాధర్, ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ సదానందం, డీసీపీ బస్వారెడ్డి నుంచి తనకు ముప్పు ఉందని, తనపై చైన్‌స్నాచింగ్ అంటూ తప్పుడు కేసు నమోదు చేశారని ఫిర్యాదు చేశాడు. అధికారులు న్యాయం చేయాలని కోరాడు. అదేవిధంగా బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబుపై చర్యలు తీసుకోవాలని రెంజల్ మండలం దూపల్లికి చెందిన బోయ భాగ్య ఫిర్యాదు చేసింది. గతనెల 13న లక్ష్మీ నరసింహ స్వామి జాతర బ్రహ్మోత్సవాల్లో తన పర్సు పోవడంతో పోలీస్ అవుట్ పోస్టులో ఫిర్యాదు చేశానని, అక్కడే ఉన్న సీఐ విజయ్‌బాబు నా మాట వినిపించుకోకుండా లాఠీతో కొట్టాడని పేర్కొంది. దీనిపై ఎడపల్లి పోలీస్ స్టేషన్‌లో, బోధన్ ఏసీపీ, ఇన్‌చార్జి సీపీకి ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. కొడుకు, కోడలు అన్నం పెట్టడం లేదని సావెల్‌కు చెందిన నర్సయ్య ఫిర్యాదు చేశాడు. 12 ఇసాల భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, భూమి తీసుకున్న తరువాత కూడా తనను పట్టించుకోవడం లేదన్నాడు. కొడుకు, కోడలు పట్టించుకోకపోవడంతో గుడి వద్ద బిచ్చమెత్తుకుంటున్నానని ఫకీరాబాద్‌కు చెందిన గుడ్డి ముత్తెమ్మ తన ఫిర్యాదులో పేర్కొంది. భర్త చనిపోయిన నాటి నుంచి ఒంటరిగా ఉంటున్నానని తెలిపింది. వర్ని మండల కేంద్రంలోని సత్యనారాయణపురంలో రామాలయం వెనుక చేపట్టిన ఓ ప్రార్థనా మందిరం అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని హిందూ సంఘాల ఐక్యవేదిక నాయకులు ఫిర్యాదు చేశారు. గతంలో హైకోర్టు స్టే ఆర్డర్ ఇచ్చినప్పటికీ మళ్లీ నిర్మాణం చేపడుతున్నారని పేర్కొన్నారు. నిర్మాణానికి అనుమతులు, రిజిస్ట్రేషన్ లేదన్నారు. ప్రజావాణిలో మొత్తం 62 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, డీపీవో శ్రీనివాస్, నిజామాబాద్ ఏసీపీ రాజావెంకటరెడ్డి అర్జీలను స్వీకరించారు.


చెరువు ఆక్రమణపై ఏడాదిన్నరగా ఫిర్యాదు

ఎడపల్లి మండలంలోని మంగళ్‌పహాడ్ సమీపంలోని 70 ఎకరాల రాయకుంట చెరువును కొందరు ఆక్రమించారని రాజు అనే వ్యక్తి మరోసారి తాజాగా ఫిర్యాదు చేశాడు. ఈ చెరువుతోపాటు గొలుసుకట్టు చెరువుగా ఉన్న కొత్తకుంట చెరువును సైతం ఆక్రమించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. గంగపుత్రులకు ఉపాధినిచ్చే ఈ చెరువులను ఆక్రమించిన విషయమై ఏడాదిన్నరగా చాలాసార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ కబ్జాదారులకు కనీసం నోటీసులు సైతం ఇవ్వలేదని ఫిర్యాదుదారుడు తెలిపాడు. భారీ చెరువు చిన్న కుంట మాదిరిగా చిక్కిపోయిందని వివరించాడు.



చెరువుల కబ్జాపై ఫిర్యాదు చేస్తున్న రాజు

పదేళ్లుగా పింఛన్ కోసం..



మణెమ్మ

నిజామాబాద్‌లోని ఎల్లమ్మగుట్ట ప్రాంతానికి చెందిన రొడ్డ మణెమ్మ భర్త 2013లో మరణించాడు. అప్పటినుంచి మణెమ్మ వితంతు పింఛన్ కోసం అధికారుల చుట్టూ తిరుగుతోంది. ప్రస్తుతం ఈమెకు 76 సంవత్సరాలు. వృద్ధాప్య పింఛన్ కోసం కూడా గతంలో దరఖాస్తు చేసుకుంది. అయినా రెండింటిలో ఏ రకమైన పింఛను అందడం లేదు. గత పదేళ్లలో మున్సిపల్, కలెక్టరేట్‌లో చాలాసార్లు దరఖాస్తు చేస్తూనే ఉంది. ఫలితం మాత్రం లేదు. కుటుంబ సభ్యులు రేషన్‌కార్డులో తన పేరు లేకపోవడంతో యాడ్ చేసేందుకు దరఖాస్తు చేసుకోగా సాంకేతిక సమస్యలున్నట్లు అధికారులు తెలిపినట్లు వాపోయింది. తాజాగా మళ్లీ కలెక్టర్‌కు అర్జీ పెట్టుకుంది. ఈసారి కూడా పరిశీలిస్తామని అధికారులు చెప్పడం గమనార్హం.

న్యూస్‌రీల్

పసుపుబోర్డు కార్యదర్శి బాధ్యతల స్వీకరణ



సుభాష్‌నగర్: జాతీయ పసుపు బోర్డు కార్యదర్శి భవానీశ్రీ నగరంలోని జాతీయ పసుపు బోర్డు కార్యాలయంలో చైర్మన్ పల్లె గంగారెడ్డి సమక్షంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో బోర్డు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడికి గురికావొద్దు

- ఇంటర్ విద్యాధికారి రవికుమార్ సూచన

నిజామాబాద్ అర్బన్: ఈనెల 5 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావొద్దని జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపుడి రవికుమార్ ఒక ప్రకటనలో సూచించారు. సెంటర్‌లలో అన్ని సౌకర్యాలు ఉంటాయని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని పేర్కొన్నారు. ప్రైవేటు కళాశాలల్లో ఎవరికైనా హాల్ టికెట్ ఇవ్వని పక్షంలో ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలకు హాజరుకావొచ్చని, హాల్ టికెట్ పైన ప్రిన్సిపాల్ సంతకం, కళాశాల ముద్ర అవసరం లేదని స్పష్టం చేశారు. ఇంటర్ పరీక్షల నిర్వహణలో పటిష్టమైన బందోబస్తుతో పాటు ప్రతి క్షణం నిబద్ధతతో పనిచేసే ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తారని, బయట ఎలాంటి పుకార్లు వ్యాపించినా నమ్మొద్దన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే ఉద్యోగులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు.

ఎయిడ్స్ పరీక్షలకు 'అంబులెన్స్'



నిజామాబాద్ నాగారం: ఎయిడ్స్ నిర్ధారణ పరీక్షలకు అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రాజశ్రీ సూచించారు. జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ యూనిట్ ఆధ్వర్యంలో పనిచేసే అంబులెన్స్ సేవలను సోమవారం ఆమె ప్రారంభించారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలో హెచ్ఐవీ ఎయిడ్స్ అధికంగా ప్రబలడానికి అవకాశం ఉన్న హైరిస్క్ ప్రాంతాల్లో ముందుగా ఈ అంబులెన్స్ సేవలను ప్రణాళికా ప్రకారం నిర్వహిస్తారన్నారు. ఎయిడ్స్ నిర్ధారణ పరీక్షలు, చికిత్స, కౌన్సెలింగ్, ఐఈసీ తదితర వాటిపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. అంబులెన్స్‌లో ఒక ల్యాబ్ టెక్నీషియన్, కౌన్సిలర్ తోపాటు ఏరియా ఎయిడ్స్ విభాగ సిబ్బంది, ఏఎన్ఎం, ఆశ కార్యకర్త ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీఎం సుధాకర్, సీపీవో మోయిజ్, నవీన్, స్రవంతి, రాజేందర్, నాగరాజు పాల్గొన్నారు.

చివరాయకట్టుకు నీరందేలా చర్యలు

- రానున్న 10 రోజులు అప్రమత్తంగా ఉండాలి
- వీసీలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ హనుమంతు, అధికారులు

నిజామాబాద్ అర్బన్: చివరాఆయకట్టు వరకు సాగు నీరందేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. యాసంగి పంటలకు సాగునీటి సరఫరా, నీటి పారుదల శాఖ పనితీరుపై సోమవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. యాసంగి పంటలకు వచ్చే పది రోజులు కీలకమని, అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సాగు రంగానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. రిజర్వాయర్లలో అవసరం మేర నీరు అందుబాటులో ఉందని, ప్రతి నీటి చుక్కనూ పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ చివరాయకట్టు వరకు నీరందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

గురుకులాలపై..

గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో తనిఖీల తరువాత పరిస్థితుల్లో మార్పు వచ్చిందని, పిల్లలకు అందించే ఆహార నాణ్యత పెరిగిందని, కామన్ మెనూ డైట్ పక్కాగా అమలు అవుతోందని సీఎస్ శాంతికుమారి అన్నారు. సింగిల్ యూసెజ్ ప్లాస్టిక్ నిషేధంలో ప్రజలను భాగస్వామ్యం చేయాల న్నారు. కలెక్టర్ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

టీచర్ స్థానంలో కమలం పాగా!

- తొలి ప్రాధాన్యత ఓట్లతోనే గెలిచిన మల్క కొమురయ్య
- కొనసాగుతున్న గ్రాడ్యుయేట్ ఓటర్ల విభజన

సాక్షిప్రతినిధి,కరీంనగర్: నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ టీచర్ నియోజవర్గం కమలం వశమైంది. తొలిప్రాధాన్యం ఓట్లతోనే మల్క కొమురయ్య టీచర్ ఎమ్మెల్సీ స్థానంలో విజయం సాధించారు.

నల్గొండ టీచర్ ఎన్నికల ఫలితాలు సాయంత్రానికే వచ్చేసినా.. కరీంనగర్ టీచర్ ఎన్నికల లెక్కింపు సాయంత్రానికి మొదలవడం గమనార్హం. కౌంటింగ్ ప్రారంభించిన రెండు గంటల్లోనే ఫలితం తేలింది. టీచర్ ఎమ్మెల్సీ స్థానంలో మొత్తం 27,088 ఓట్లకు గాను 25,041 ఓట్లు పోల్ అవగా.. అందులో 24,144 చెల్లుబాటు అయ్యాయి. 897 ఓట్లు చెల్లలేదు. దీంతో గెలుపు కోటా ఓట్లు 12,073గా నిర్ధారించారు. బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్యకు 12,959, వంగ మహేందర్‌రెడ్డికి 7,182, అశోక్‌కుమార్‌కు 2,621, కూర రఘోత్తంరెడ్డికి 428 ఓట్లు వచ్చాయి.



కొమురయ్యకు స్వీట్ తినిపిస్తున్న బండి సంజయ్

బండి అభినందనలు

రాత్రి 10.20 గంటల సమయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కౌంటింగ్ సెంటర్ వద్దకు వచ్చి మల్క కొమురయ్యను అభినందించారు. ఇది చారిత్రక విజయమని, ఈ తీర్పు టీచర్లకు, మోదీకి అంకితమని అన్నారు.

ఉదయం 8 నుంచి..

సోమవారం ఉదయం నుంచి గ్రాడ్యుయేట్ ఓట్ల వడపోత కొనసాగుతూనే ఉంది. ఉదయం 8 గంటలకు మొదలు పెట్టిన ఎన్నికల లెక్కింపు, చెల్లని, చెల్లిన ఓట్ల విభజనపై రాత్రి 9గంటలు దాటేవరకు ఎలాంటి ప్రకటనా చేయలేదు. అప్పటి వరకూ దాదాపు లక్ష ఓట్లను వడబోయగా అందులో 92,000 చెల్లుబాటు అయ్యాయని, 8,000 ఓట్లు చెల్లలేదని, మిగిలిన 1.5 లక్షల ఓట్ల వడబోత మంగళవారం మధ్యాహ్నం వరకు పూర్తవుతుందని అధికారులు ప్రకటించారు.

లెక్కింపు ప్ర క్రియ మందకొడిగా సాగడంపై అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలైన ఓట్లలో కొందరు 01, 02 అని వేసిన వారి ఓట్లు పరిగణనలోకి తీసుకోవాలని పట్టభద్రుల స్థానానికి పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి ఆర్వోకు వినతి పత్రం ఇచ్చారు.

డాక్యుమెంట్‌కో ధర.. వసూళ్లకు దళారి

- కాసులు కురిపిస్తున్న రిజిస్ట్రేషన్లు
- ఇప్పటి వరకు ఏసీబీకి చిక్కిన డీఆర్.. ఐదుగురు సబ్ రిజిస్ట్రార్లు

ఖలీల్‌వాడి: డాక్యుమెంట్‌ను బట్టి ధర.. డబ్బులు వసూలు చేసేందుకు దళారి.. ఇదీ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో కొనసాగుతున్న ట్రెండ్. రిజిస్ట్రేషన్ అంటేనే కాసుల పంట అనే స్థాయికి పరిస్థితి చేరింది. చిన్నచిన్న తప్పులను కప్పిపుచ్చి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకునేందుకు ఆస్తుల కొనుగోలు, అమ్మకందారులు ఖర్చుకు వెనుకడుగు వేయడం లేదు. దీంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో కాసుల పంట పండుతోంది.

ఇళ్లు, ఇంటిస్థలాలకు రిజిస్ట్రేషన్లు

వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు ప్రస్తుతం తహసీల్ కార్యాలయాల్లో చేస్తుండగా, రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఇళ్లు, ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ఇళ్ల స్థలాలకు డీటీసీపీ అప్రూవల్, నాలా కన్వర్షన్ తప్పనిసరిగా ఉండాలి. వాటికే రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. అలాకాకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులు వ్యవసాయభూములు కొనుగోలు చేసి వాటిని వెంచర్లుగా మార్చి స్థానిక డాక్యుమెంట్ రైటర్లు లేదా రిజిస్ట్రేషన్ అధికారులతో ఒప్పందం చేసుకుని రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ఫేక్ రిజిస్ట్రేషన్లకు డాక్యుమెంట్‌ను బట్టి ధర నిర్ణయిస్తున్నారు. పాత ఇళ్లకు జీపీలు, కార్పొరేషన్, మున్సిపాలిటీల నుంచి ఓనర్ షిప్ సర్టిఫికెట్ తీసు కుని చేయించుకుంటున్నారు. కుటుంబ సభ్యులు బతికి ఉంటే వాటికి సంబంధించిన వివరాలు పెట్టాల్సి ఉంటుంది. లేనిపక్షంలో డెత్ సర్టిఫికెట్‌తోపాటు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జతచేసి ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. లేనిపక్షంలో ఆ ఇంట్లోని పెద్ద ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. వీటికి సబ్ రిజిస్ట్రార్లు నిర్ణయించిన ప్రకారం డబ్బులు చెల్లిస్తే ఓకే.. లేదంటే కొర్రీలు పెడతారు.

వసూళ్లు ఇలా..

సబ్ రిజిస్ట్రార్ వద్దకు వచ్చిన డ్యాకుమెంట్‌ను బట్టి ధరను నిర్ణయిస్తారు. ఆ మొత్తాన్ని డాక్యుమెంట్ రైటర్ ద్వారా లేదా దళారి ద్వారా తీసుకుంటారు. డ్యాకుమెంట్ రైటర్ల వద్ద సబ్ రిజిస్ట్రార్ ప్రతి శనివారం రిజిస్ట్రేషన్లకు సంబంధించి డబ్బులు వసూలు చేసుకుంటారనే ప్రచారం ఉంది.

జిల్లాలో ఏసీబీకి చిక్కినవారు..

ఇప్పటి వరకు జిల్లా రిజిస్ట్రార్(డీఆర్)తోపాటు ఐదుగురు సబ్ రిజిస్ట్రార్‌లు ఏసీబీకి చిక్కారు. 2016లో నిజామాబాద్ రిజిస్ట్రార్ మోహన్ ఏసీబీకి చిక్కగా ఆ తరువాత సబ్‌రిజిస్ట్రార్‌లు సతీశ్, శ్రీనాథ్, శ్రీధర్, ఆనంద్ లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. తాజాగా నిజామాబాద్ అర్బన్ సబ్ రిజిస్ట్రార్-2 శ్రీరామరాజు ఏసీబీకి చిక్కారు.

ఏసీబీకి చిక్కిన సబ్ రిజిస్ట్రార్, స్వీపర్

- ఓపెన్ ప్లాట్ రిజిస్ట్రేషన్‌కు రూ. 10 వేలు తీసుకుంటుండగా పట్టివేత

ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలోని అర్బన్ సబ్ రిజిస్ట్రార్-2 శ్రీరామరాజు, స్వీపర్ రంగ్‌సింగ్ వెంకట్రావులు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. అయితే లంచం ఇచ్చిన బాధితుడి వివరాలను అధికారులు గోప్యంగా ఉంచారు. ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఓపెన్ ప్లాట్ రిజిస్ట్రేషన్ కోసం బాధితుడు సోమవారం ఉదయం 11.50 గంటలకు సబ్‌రిజిస్ట్రార్ చెన్నమాధవేణి శ్రీరామరాజు వద్దకు వెళ్లగానే డాక్యుమెంట్‌ను కౌంటర్‌లో, లంచం డబ్బులు స్వీపర్ రంగ్‌సింగ్ వెంకట్రావుకు ఇవ్వాలని చెప్పారు. బాధితుడు డాక్యుమెంట్లను కౌంటర్‌లో ఇచ్చి అనంతరం స్వీపర్ వెంకట్రావును కలిశారు. బాధితుడిని స్వీపర్ వెంకట్రావు కార్యాలయ అధికారులు భోజనం చేసే గదిలోకి తీసుకువెళ్లి రూ.10 వేలు తీసుకుని జేబులో పెట్టుకొగానే అప్పటికే మాటువేసిన ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఓపెన్ ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయడానికి సబ్‌రిజిస్ట్రార్-2 శ్రీరామరాజు డబ్బులు డిమాండ్ చేయడంతో కెమికల్ పూసిన రూ.10 వేలు ఇచ్చినట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. స్వీపర్ వెంకట్రావును పట్టుకున్న అనంతరం విచారణ జరిపి సబ్ రిజిస్ట్రార్-2 శ్రీరామరాజును అదుపులోకి తీసుకున్నామన్నారు. ఇద్దరిని హైదరాబాద్‌లోని నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామన్నారు. కాగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని సబ్‌రిజిస్ట్రార్-2 శ్రీరామరాజు ఇంట్లోనూ ఏసీబీ అధికారులు సోదాలు చేస్తున్నట్లు తెలిసింది. ఏసీబీ దాడుల సందర్భంగా కార్యాలయంలో రెండుగంటల పాటు రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు. వెయిటింగ్ హాల్ నుంచే సబ్‌రిజిస్ట్రార్-1 రిజిస్ట్రేషన్లు చేశారు.

శ్రీరామరాజు ఆదిలాబాద్ జిల్లా బోథ్ నుంచి నిజామాబాద్‌కు బదిలీపై వచ్చారు. మొదట్లో డాక్యుమెంట్ రైటర్లతో వివాదం జరిగింది. రిజిస్ట్రేషన్‌లో ఇబ్బందులకు గురి చేస్తున్నారని గత నవంబర్‌లో డాక్యు మెంట్ రైటర్లు ధర్నా చేశారు. గతంలో రామరాజు నిర్మల్ జిల్లా భైంసాలో పని చేస్తున్న సమయంలో ఇల్లీగల్ డాక్యుమెంట్లకు రిజిస్ట్రేషన్ చేశారనే ఆరోపణలతో ఆదిలాబాద్‌కు బదిలీ చేసినట్లు తెలిసింది. అక్కడ రామరాజును సస్పెండ్ చేసినట్లు సమాచారం.



ఏసీబీకి పట్టుబడిన సబ్‌రిజిస్ట్రార్ శ్రీరామరాజు, స్వీపర్ రంగుసింగ్ వెంకట్‌రావు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితం ఉత్కంఠ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉత్కంఠను కలిగిస్తోంది. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ఆలస్యంగా అయినా ఫలితం తేలింది.

ఇక కీలకమైన పట్టభద్రుల ఓట్ల లెక్కింపు మాత్రం యంత్రాంగానికి పెద్ద టాస్క్ అవుతోంది. ఇదిలా ఉండగా ఉపాధ్యాయులు, పట్టభద్రులకు సంబంధించి చెల్లని ఓట్ల సంఖ్య భారీగా ఉండడం గమనార్హం. నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల ఓట్లు మొత్తం 3,55,159 ఉన్నాయి. ఇందులో 2.50 లక్షలకు పైగా ఓట్లు పోలయ్యాయి.

లెక్కింపు మొదలుపెట్టిన రోజైన సోమవారం రాత్రికి 1 లక్ష ఓట్లను చెల్లిన ఓట్లు, చెల్లని ఓట్లుగా విభజన చేశారు. ఇంకా 1.5 లక్షల పోలైన ఓట్లను చెల్లిన, చెల్లని ఓట్లుగా విభజన చేయాల్సి ఉంది. ఇప్పటివరకు విభజన చేసిన 1 లక్ష ఓట్లలో 8 వేలకు పైగా చెల్లని ఓట్లు ఉండడం గమనార్హం. మిగిలిన 1.5 లక్షల ఓట్లలో చెల్లని ఓట్ల సంఖ్య భారీగా ఉండనున్నట్లు తెలుస్తోంది.

నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలోని 42 శాసన సభ సెగ్మెంట్ల నుంచి వచ్చిన బ్యాలెట్ బాక్సులు, వాటిలోని బ్యాలెట్ పేపర్లను కట్టలుగా కట్టడం, విభజన చేసేందుకే చాలా సమయం తీసుకుంటోంది. పైగా అభ్యర్థుల సంఖ్య భారీగా ఉంది. మొత్తం 56 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. దీంతో జంబో బ్యాలెట్ పేపర్ తప్పనిసరి అయింది. పైగా ఓట్లు ప్రాధాన్యత క్రమంలో వేసే పరిస్థితి నేపథ్యంలో ప్రతి బ్యాలెట్ పేపర్‌ను క్షుణ్ణంగా పరిశీలించాల్సిన ఆవశ్యకత ఉంది. పైగా ప్రాధాన్యత ఓట్లు వేసే క్రమంలో సింగిల్ డిజిట్‌లో, అభ్యర్థి పేరు పక్కన ఉన్న బాక్సులో మాత్రమే అంకెలు వేయాలి. ఎంతమందికి ప్రాధాన్యత ఇచ్చినప్పటికీ మధ్యలో ఏదేని అంకె వేయని పక్షంలో సదరు ఓటు చెల్లకుండా పోతుంది. టిక్కు మార్కులు, ముద్రలు తదితరాలు వేసినా ఓటు చెల్లదు. ఈ క్రమంలో ప్రతి బ్యాలెట్ పేపర్‌ను చాలా జాగ్రత్తగా పరిశీలించాల్సి ఉంది. ఇక మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపుతో ఫలితం తేలకపోతే రెండో ప్రాధాన్యత, మూడో ప్రాధాన్యత ద్వారా తేల్చాలంటే ఎలిమినేషన్ రౌండ్ లెక్కింపు తప్పనిసరి.



పట్టభద్రుల ఓట్లను విభజిస్తున్న సిబ్బంది

మల్క కొమురయ్య గెలుపు సంబురాలు..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్లు మొత్తం 27,088 ఉండగా ఇందులో 24వేలకు పైగా ఓట్లు నమోదయ్యాయి. సోమవారం రాత్రి ఫలితం తేలింది. బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య విజయం సాధించడంతో పార్టీ శ్రేణులు సంబురాలు చేసుకున్నాయి.

క్లుప్తంగా

చేనేత సంఘాన్ని సందర్శించిన అధికారులు



కార్మికుల వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

రుద్రూర్‌: మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘాన్ని హ్యాండ్‌లూమ్స్‌ అండ్‌ టెక్స్‌టైల్స్‌ డెవలప్‌మెంట్‌ ఆఫీసర్‌ బి.వెంకటేశ్వర్లు, అసిస్టెంట్‌ డెవలప్‌మెంట్‌ ఆఫీసర్‌ హేమలత సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా సంఘంలో పనిచేస్తున్న కార్మికుల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం నేత కార్మికుల కోసం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. తెలంగాణ నేతన్న పొదుపు పథకంలో భాగంగా చేనేత, అనుబంధ కార్మికులు వారి వేతనాల నుంచి నెలవారీగా 8శాతం కాంట్రిబ్యూషన్‌ చేస్తే ప్రభుత్వం రెండింతలు జమ చేస్తుందన్నారు. గతంలో మూడేళ్ల వరకు పొదుపుల వ్యవధి ఉండగా, ప్రభుత్వం రెండేళ్లకు తగ్గించిందని తెలిపారు. కార్యక్రమంలో సీడీఈలు ఎస్‌. నరేందర్‌, ఎస్‌. వేణు, చేనేత సంఘం అధ్యక్షుడు మోత్కురి నారాయణ, సంఘం మేనేజర్‌ ఈర్వ నాగరాజు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ అడిషనల్‌ కంట్రోలర్‌గా సంపత్‌



ఉత్తర్వులు తీసుకుంటున్న సంపత్‌

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ అడిషనల్‌ కంట్రోలర్‌ (కాన్ఫిడెన్షియల్‌)గా అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ టి.సంపత్‌ నియమితులయ్యారు. వీసీ ప్రొఫెసర్‌ టి.యాదగిరిరావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ ఎం.యాదగిరి సోమవారం నియామక ఉత్తర్వులను అందజేశారు. గత దశాబ్ద కాలంగా ఎకనామిక్స్‌ విభాగంలో అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌గా సంపత్‌ సేవలందిస్తున్నారు. తనపై నమ్మకంతో అడిషనల్‌ కంట్రోలర్‌గా నియమించిన వీసీ, రిజిస్ట్రార్‌లకు సంపత్‌ కృతజ్ఞతలు తెలిపారు.

రేపు ప్రయోగాల ప్రదర్శన సదస్సు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్‌

తెయూ(డిచ్‌పల్లి): జాతీయ సైన్స్‌ దినోత్సవం సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 5న జీవ సాంకేతిక శాస్త్ర ప్రయోగాల ప్రదర్శన సదస్సు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్‌ డాక్టర్‌ ప్రసన్నశీల తెలిపారు. సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను వీసీ ప్రొఫెసర్‌ టి.యాదగిరిరావు, రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ ఎం.యాదగిరి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసన్నశీల మాట్లాడుతూ సదస్సుకు తెయూ పరిధిలోని అనుబంధ కళాశాలల విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. జీవ సాంకేతిక శాస్త్ర ప్రయోగ పద్ధతులు, అందుకు ఉపయోగించే పరికరాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు సదస్సును సద్వినియోగం చేసుకోవాలని వీసీ, రిజిస్ట్రార్‌లు సూచించారు. కార్యక్రమంలో సదస్సు కోకన్వీనర్‌ కిరణ్మయి, మహేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

పంటలు గట్టెక్కేనా?

- నిజాంసాగర్‌నుంచి కొనసాగుతున్న నీటి విడుదల
- చివరి ఆయకట్టుకు నీరందడం లేదని రైతుల ఆందోళన
- అర్ధరాత్రి తనిఖీలు చేస్తున్న నేతలు, అధికారులు
- పంటలు గట్టెక్కిస్తామంటూ భరోసా కల్పించే యత్నం

ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా వరప్రదాయిని అయిన నిజాంసాగర్‌ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు విడతల వారీగా నీటి విడుదల కొనసాగుతోంది. అయితే చివరి ఆయకట్టుకు నీరందక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదుకోవాలని ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. దీంతో ప్రజాప్రతినిధులు, అధికారులు కాలువలను పరిశీలిస్తూ రైతులకు భరోసా ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు.



నిజాంసాగర్‌ ఆయకట్టు కింద సాగవుతున్న వరి

నిజాంసాగర్‌: నిజాంసాగర్‌ ప్రాజెక్టు ఆయకట్టు కింద ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలో 1.25 లక్షల ఎకరాల్లో వరి పంట సాగవుతోంది. పంటకు అవసరమైన నీటి కోసం ఇప్పటికే మూడు విడతల్లో నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం నాలుగో విడత కొనసాగుతోంది. ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు రోజూ 2,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అయితే ఈ నీరు డిస్ట్రిబ్యూటరీల చివరి వరకు అందకపోవడంతో పంటలు ఎండుముఖం పడుతున్నాయి. దీంతో చివరి ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

నీటి కోసం అధికారుల నిర్బంధం

నిజాంసాగర్‌ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేస్తున్నారు. కానీ ప్రధాన కాలువ పరిధిలోని వర్ని, చందూర్‌, జాకోరా, రుద్రూర్‌, కోటగిరి, బోధన్‌ ప్రాంతాల్లోని పొలాలకు నీళ్లు రావడం లేదని రైతులు పేర్కొంటున్నారు. ఎగువన ఉన్న రైతులు ఎక్కువ నీటిని వినియోగించుకుంటుండడంతో ఈ పరిస్థితి వచ్చిందని తెలుస్తోంది. కాలువకు నీటి విడుదలను పెంచాలని రైతులు కోరుతున్నారు. కాగా పంటలకు నీరు అందడం లేదంటూ ఇటీవల బోధన్‌ ప్రాంత రైతులు నీటిపారుదల శాఖ అధికారులను నిర్బంధించారు. అలాగే నీరందక పంటలు ఎండిపోతున్న విషయాన్ని బీర్కూర్‌, వర్ని ప్రాంత రైతులు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన పోచారం.. రాత్రి వేళలో కాలువలపై పర్యటించి, పరిస్థితిని అధికారులతో సమీక్షించారు. చివరి ఆయకట్టు వరకు నీరందేలా చూడాలని సూచించారు. డి–26 ఉప కాలువ కింద ఎక్కువ విస్తీర్ణంలో ఆయకట్టు ఉందని, చివరి ఆయకట్ట వరకు నీరు వెళ్లాలంటే కనీసం 3 ఫీట్లు తగ్గకుండా ఉప కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని ఆదేశించారు. అలాగే బోధన్‌ ఎమ్మెల్యే సైతం నిజాంసాగర్‌ ప్రాజెక్టును సందర్శించి, అధికారులతో సమీక్షించారు. ప్రాజెక్టులో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నందున చివరి ఆయకట్టు గట్టెక్కేవరకు నీటిని విడుదల చేయాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టు నీరు వృథా కాకుండా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.

రాత్రి వేళ తనిఖీలు

ఆయకట్టు ప్రాంత రైతుల ఆందోళనల నేపథ్యంలో జిల్లా నీటిపారుదల శాఖ సీఈ శ్రీనివాస్‌, ఎస్‌ఈ రాజశేఖర్‌, ఈఈ సోలోమాన్‌, డిప్యూటీ ఈఈ, ఏఈలు, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, లస్కర్లు రాత్రి వేళలో ప్రధాన కాలువను తనిఖీ చేస్తున్నారు. నిజాంసాగర్‌, మహమ్మద్‌నగర్‌, బాన్సువాడ, బీర్కూర్‌, నస్రుల్లాబాద్‌, వర్ని, చందూర్‌, జాకోరా, రుద్రూర్‌, కోటగిరి, బోధన్‌ మండలాల్లో ఆయా డివిజన్ల అధికారులు కాలువలను సందర్శించి, నీరు దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకుంటున్నారు.

మూడు విడతల్లో 6 టీఎంసీలు..

ఆయకట్టుకు నీరందించేందుకు నిజాంసాగర్‌ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేస్తున్నారు. 10 రోజులు ఆన్‌, ఆఫ్‌ పద్ధతిలో నీటి విడుదల కొనసాగుతోంది. డిసెంబర్‌ 13 న నీటి విడుదల ప్రారంభమైంది. ఇప్పటివరకు మూడు విడతల్లో 6 టీఎంసీల నీటిని ప్రధాన కాలువ ద్వారా ఆయకట్టుకు అందించారు. ప్రస్తుతం నాలుగో విడత నీటి విడుదల కొనసాగుతోంది. నాలుగో విడతలో ఇప్పటివరకు 1.481 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.



నిజాంసాగర్‌ ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న నీరు

అక్రమంగా నీటిని తరలిస్తున్నారు

నిజాంసాగర్‌ ప్రధాన కాలువకు ఒక పక్కన మోటార్లు ఏర్పాటు చేసి అక్రమంగా నీటిని తరలిస్తున్నారు. బాన్సువాడ, వర్ని, జాకోరా, చందూర్‌, రుద్రూర్‌ అక్రమంగా నీటిని తోడేస్తున్నారు. సుమారు 20 వేల ఎకరాలకు అక్రమంగా నీటిని తరలించుకుపోతున్నారు. దీంతో డిస్ట్రిబ్యూటరీల చివరి వరకు నీరందడం లేదు. ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదిస్తాం.

– శ్రీనివాస్‌, జిల్లా నీటిపారుదలశాఖ సీఈ

మోదీ పాలనలో రాష్ట్రానికి అన్యాయం జరగదు

- సీఎం రేవంత్‌రెడ్డి పనికిమాలిన రాజకీయాలు మానుకోవాలి
- ఎంపీ అర్వింద్‌ ధర్మపురి



ఎంపీ అర్వింద్‌ ధర్మపురి

సుభాష్‌నగర్‌: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో తెలంగాణకు ఎలాంటి అన్యాయం జరగదని, రాష్ట్రంలోని ప్రాజెక్టులకు కిషన్‌ రెడ్డి అడ్డుపడుతున్నారనడం సరికాదని ఎంపీ అర్వింద్‌ ధర్మపురి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. సీఎం కార్యాలయ అధికారులను ప్రాజెక్టుల డీపీఆర్‌లతో పంపించాలని, తాను కిషన్‌రెడ్డిని వెంట తీసుకువస్తానని, వెంటనే ఎక్కడ అడ్డుపడ్డారో తేలిపోతుందని సవాల్‌ విసిరారు. ప్రధాని మోదీకి అన్ని రాష్ట్రాలు సమానమేనని తెలిపారు. మూసీ ప్రక్షాళన డీపీఆర్‌ తప్పులతడకగా ఉందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి పనికిమాలిన రాజకీయాలు మానుకోవాలని, కల్లబొల్లి కబుర్లు చెప్పుకుంటూ ప్రజలను మభ్యపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 నెలల్లోనే కాంగ్రెస్‌ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, మహిళలు చీపుర్లు పట్టుకుని కొట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. జాతీయస్థాయి పసుపు బోర్డు ఏర్పాటులో తాను కీలకపాత్ర పోషించానని, రెగ్యులర్‌గా కేంద్రం నుంచి జరిగే అభివృద్ధిని చేయలేమా అని ప్రశ్నించారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు



నాయకులకు మిఠాయిలు తినిపిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌ కులాచారి

సుభాష్‌నగర్‌: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బీజేపీ, తపస్‌ బలపర్చిన అభ్యర్థి మల్క కొమరయ్య గెలుపుతో బీజేపీ శ్రేణులు జిల్లా కేంద్రంలో సోమవారం సంబరాలు నిర్వహించాయి. జిల్లా అధ్యక్షుడు దినేశ్‌ పటేల్‌ కులాచారి ఆధ్వర్యంలో నగరంలోని నిఖిల్‌సాయి చౌరస్తాలో టపాకాయలు కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. అంతకుముందు పార్టీ కార్యాలయం నుంచి నిఖిల్‌సాయి చౌరస్తా వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం దినేశ్‌ పటేల్‌ కులాచారి మాట్లాడుతూ యూనియన్లకు అతీతంగా మోదీ నాయకత్వంపై విశ్వాసంతో ఉపాధ్యాయులు మల్క కొమరయ్యకు ఓట్లు వేసి గెలిపించారని తెలిపారు. మొదటి ప్రాధాన్యత ఓట్లతో గెలిపించి చరిత్ర సృష్టించారన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ కూడా బీజేపీ బలపర్చిన అభ్యర్థి విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కొండా ఆశన్న, పద్మారెడ్డి, గంగోనె గంగాధర్‌, ఇప్పకాయల కిశోర్‌, దొంతుల రవి, జగన్‌, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్‌ అసిస్టెంట్‌గా కారుణ్య నియామకం



ఉత్తర్వులు అందజేస్తున్న వీసీ, రిజిస్ట్రార్‌

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ తెలుగు అధ్యాపకులు ఆచార్య బాలశ్రీనివాసమూర్తి కూతురు ప్రసన్న హంసిక జూనియర్‌ అసిస్టెంట్‌గా నియామకమయ్యారు. తెలుగు విభాగంలో సుదీర్ఘ కాలం పని చేసిన బాలశ్రీనివాసమూర్తి అకాల మరణం చెందిన విషయం తెలిసిందే. సోమవారం వీసీ ప్రొఫెసర్‌ టి.యాదగిరిరావు, రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ ఎం.యాదగిరి నియామక ఉత్తర్వులు అందజేశారు. వీసీ, రిజిస్ట్రార్‌లకు టూటా అధ్యక్షులు ఏ.పున్నయ్య, ఉపాధ్యక్షులు సత్యనారాయణరెడ్డి, కోశాధికారి ఏ.నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి



పేకాడుతూ పట్టుబడిన వారితో టాస్క్‌ఫోర్స్‌ సిబ్బంది

నిజామాబాద్‌ రూరల్‌: రూరల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఓ పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్‌ ఇన్‌స్పెక్టర్‌ అంజయ్య, స్పెషల్‌ పార్టీ పోలీసులు ఇన్‌చార్జి సీపీ సింధు శర్మ ఆదేశాలతో సోమవారం దాడి చేశారు. విఠలేశ్వర్‌ నగర్‌ రైస్‌మిల్‌ పక్కన పేకాడుతున్నారనే విశ్వసనీయ సమాచారంతో దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 3 సెల్‌ఫోన్లు, రూ. 2,450ల నగదు, మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొని రూరల్‌ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

క్రైం కార్నర్‌

ఇనుప చువ్వల కోసం వెళ్లి ఒకరి మృతి



నాగం రవి మృతదేహం

నందిపేట్‌(ఆర్మూర్‌): ఇనుప చువ్వల కోసం చెరువులోకి దిగిన వ్యక్తి ప్రమాదవశాత్తు మరణించాడు. నందిపేట ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన నాగం రవి(52) వృత్తిరీత్యా గోడలకు సున్నాలు వేస్తుంటాడు. ఆదివారం సాయంత్రం నందిపేట బైపాస్‌ రోడ్డుకు ఆనుకుని ఉన్న ఊర చెరువులో వినాయక విగ్రహాల ఇనుప చువ్వల కోసం దిగాడు. ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. మృతుడి తండ్రి నాగం రాజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ ..



స్వరూప మృతదేహం

ఎల్లారెడ్డి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై మహేశ్‌ తెలిపారు. ఎల్లారెడ్డి మండలం మాచాపూర్‌ గ్రామ శివారులో శనివారం రాత్రి కారు, లారీ ఢీకొన్న ప్రమాదంలో పూల్‌సింగ్‌ మృతి చెందిన విషయం తెలిసిందే. ఇదే ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్వరూప(32) సోమవారం మరణించినట్లు ఎస్సై పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి ఏడాది జైలు

కమ్మర్‌పల్లి: మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో ఓవ్యక్తికి ఏడాది జైలు శిక్షతోపాటు రూ. 5 వేల జరిమానా విధిస్తూ ఆర్మూర్‌ కోర్టు ప్రథమశ్రేణి న్యాయమూర్తి నెల్లి సరళరాణి తీర్పు వెలువరించారు. కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. ఓ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని మండల కేంద్రానికి చెందిన తుదిగేన దేవేందర్‌పై 2019లో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. విచారణ అనంతరం పోలీసులు నిందితుడిపై కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన ప్రథమశ్రేణి న్యాయమూర్తి నెల్లి సరళరాణి సోమవారం తీర్పు వెలువరించారు. సాక్ష్యాలను ప్రవేశపెట్టడంలో కీలకపాత్ర పోషించిన కోర్టు కానిస్టేబుల్‌ రాజును ఎస్సై అనిల్‌రెడ్డి అభినందించారు.

ఆస్తి కోసం తండ్రిపై దాడి

- చికిత్స పొందుతూ మృతి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని శెట్పల్లి గ్రామానికి చెందిన వల్లకాటి లింగం(48) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గత నెల 17న రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తన తండ్రి లింగంను కొట్టినట్లు కొడుకు శేఖర్‌ డయల్‌ 100కు కాల్‌ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని లింగంను నిజామాబాద్‌ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి రిఫర్‌ చేశారు. ఘటనపై కొడుకు శేఖర్‌ చెప్పే మాటలకు పొంతన లేకపోవడంతో పోలీసులకు అనుమానం వచ్చి అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో తానే ఆస్తి కోసం తండ్రిని గాయపర్చినట్లు ఒప్పుకున్నాడు. శేఖర్‌ కొంతకాలం నుంచి తండ్రికి దూరంగా హైదరాబాద్‌లో ఉంటుండగా, లింగం శెట్పల్లిలో నివసిస్తున్నాడు. కొద్దిరోజులుగా శేఖర్‌ ఆస్తి కోసం తండ్రితో గొడవపడుతున్నట్లు తెలిపారు. 15 రోజులపాటు ఆస్పత్రిలో చికిత్స పొందిన లింగం సోమవారం మృతి చెందినట్లు పేర్కొన్నారు. శేఖర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరిపై డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసు

మోపాల్‌: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ తనిఖీల్లో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్‌ తెలిపారు. మద్యం తాగి బైక్‌ నడుపుతున్న ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా ద్విచక్రవాహనాలు నడిపిస్తున్న 23 మందికి జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు. ఆయన వెంట ఏఎస్సై రమేశ్‌బాబు, హెచ్‌సీ గంగాధర్‌, కానిస్టేబుళ్లు ఉన్నారు.

తరలివచ్చిన పచ్చ బంగారం



నిజామాబాద్‌ వ్యవసాయ మార్కెట్‌ యార్డుకు సోమవారం 50 వేల బస్తాలకు పైగా పసుపు తరలి వచ్చింది. శివరాత్రి, అమావాస్య, ఇతర వరుస సెలవుల అనంతరం ప్రారంభమైన మార్కెట్‌కు పసుపు పంట పోటెత్తింది. నిర్మల్‌, ఉమ్మడి కరీంనగర్‌, కామారెడ్డి, ఆదిలాబాద్‌, మహారాష్ట్రలోని నాందేడ్‌ జిల్లాల నుంచి రైతులు పసుపును తీసుకొచ్చారు. మార్కెట్‌యార్డు పసుపుమయంగా మారింది.

– సాక్షి స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, నిజామాబాద్‌



నిజామాబాద్‌ మార్కెట్‌ యార్డులో పసుపు రాశులు

అంతర్జాతీయస్థాయికి పసుపు ఉత్పత్తులు



కమ్మర్‌పల్లిలోని పరిశోధన కేంద్రంలో పసుపు కొమ్ములను పరిశీలిస్తున్న భవానీశ్రీ, గంగారెడ్డి



మనోహరాబాద్‌లో పసుపు ఉత్పత్తిని పరిశీలిస్తున్న భవానీశ్రీ

జక్రాన్‌పల్లి/కమ్మర్‌పల్లి: పసుపు ఉత్పత్తులను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని జాతీయ పసుపు బోర్డు కార్యదర్శి ఎన్‌ భవానీశ్రీ అన్నారు. జక్రాన్‌పల్లి మండలంలోని మనోహరాబాద్‌లో పసుపు రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన (జేఎంకేపీఎం)పసుపు పరిశ్రమతోపాటు, కమ్మర్‌పల్లిలోని పసుపు పరిశోధన కేంద్రాన్ని బోర్డు చైర్మన్‌ పల్లె గంగారెడ్డితోపాటు భవానీశ్రీ సందర్శించారు. పరిశోధన కేంద్రంలో సాగైన పసుపు రకాలను పరిశీలించి, వాటి గురించి వివరాలు, నాణ్యత, కుర్కుమిన్‌, దిగుబడి, వ్యయం తదితర అంశాలతో పాటు ఏయే అంశాలపై పరిశోధన సాగుతోందనే విషయాలను శాస్త్రవేత్త మహేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్లో పసుపు ధర లభ్యతపై చర్చించారు. జాతీయస్థాయిలో ఎన్నో రకాల సుగంధ ద్రవ్యాలు ఉన్నాయని, వాటన్నింటినీ ఇప్పటి వరకు స్పైసెస్‌ బోర్డు ద్వారా ఎగుమతి చేసుకుంటూ వచ్చామన్నారు. అయితే ప్రస్తుతం పసుపులో ఎంత పొటెన్షియల్‌ ఉందని, జాతీయ స్థాయిలో ఎలా మార్కెటింగ్‌ చేసుకోవాలనే దానిని పరిశీలిస్తున్నామ న్నారు. పసుపులో పొటెన్షియల్‌ పెంచుకుని మార్కెటింగ్‌, బ్రాండింగ్‌, గ్రేడింగ్‌ ఎలా చేసుకోవచ్చనే దిశగా ఆలోచిస్తున్నట్లు తెలిపారు. పసుపును అంతర్జాతీయ స్థాయిలో ప్రమోట్‌ చేయడమే కేంద్ర ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు. వారివెంట పసుపు రైతుల ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్లు తిరుపతిరెడ్డి, సంతోష్‌రెడ్డి, నూతికాడి భోజన్న, శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, అనిల్‌కుమార్‌ ఉన్నారు.

త్వరలో గల్ఫ్‌ అమరుల సంస్మరణ సభ

- మృతుల కుటుంబాలతో సహపంక్తి భోజనం చేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా అందించిన నేపథ్యంలో కార్యక్రమానికి శ్రీకారం



సీఎం రేవంత్‌రెడ్డితో గల్ఫ్‌ అంశాలపై చర్చిస్తున్న టీజీఎండీసీ చైర్మన్‌ ఈరవత్రి అనిల్‌

మోర్తాడ్‌(బాల్కొండ): గల్ఫ్‌ దేశాల్లో మరణించిన వారిని స్మరిస్తూ ప్రత్యేక సభను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. మృతి చెందిన వలస కార్మికుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా మంజూరు చేసిన నేపథ్యంలో వారితో సహపంక్తి భోజనం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సుముఖత వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో గల్ఫ్‌ కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్‌ పార్టీ ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు అధికారంలోకి వచ్చిన తర్వాత వారికోసం ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర మినరల్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌, మాజీ విప్‌ ఈరవత్రి అనిల్‌, టీపీసీసీ ఎన్నారై సెల్‌ కన్వీనర్‌ మంద భీంరెడ్డిల విజ్ఞప్తి మేరకు గల్ఫ్‌ మృతుల కుటుంబాలతో సమావేశానికి సీఎం ఆమోదం తెలిపారు. ఈ నెలలోనే ప్రజాభవన్‌ వేదికగా గల్ఫ్‌ అమరుల సంస్మరణ సభ నిర్వహించనున్నారు.

సీఎం అంగీకరించడం గొప్ప విషయం

గల్ఫ్‌ అమరుల సంస్మరణ సభతోపాటు, ఎక్స్‌గ్రేషియా అందుకున్న కుటుంబాలతో సహపంక్తి భోజనాలకు సీఎం రేవంత్‌రెడ్డి అంగీకరించడం గొప్ప విషయం. గల్ఫ్‌ కార్మికులు కాంగ్రెస్‌ పార్టీకి అండగా ఉండడంతోనే మెజారిటీ ఓట్లు వచ్చాయన్న విషయాన్ని సీఎంకు వివరించాం.

– ఈరవత్రి అనిల్‌, టీజీఎండీసీ చైర్మన్‌

ఇష్టంతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

డీఈవో అశోక్‌



బోర్గాం(పి)లో మాట్లాడుతున్న డీఈవో అశోక్‌

మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌ ఉద్బోధించారు. నగర శివారులోని బోర్గాం(పి) జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో ఇంపాక్ట్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు మోటివేషన్‌ తరగతులను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ బోర్గాం(పి) జెడ్పీహెచ్‌ఎస్‌ అంటే జిల్లాలో ప్రత్యేక స్థానం ఉంటుందని, 194 మంది విద్యార్థులు పదోతరగతి పబ్లిక్‌ పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. విద్యార్థులు కష్టపడి ప్రణాళిక ప్రకారం చదివితే మంచి గ్రేడ్‌ సాధించవచ్చని పేర్కొన్నారు. పాఠ్యాంశాల్లో సందేహాలుంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. మోటివేటర్‌ గంగాప్రసాద్‌ మాట్లాడుతూ పరీక్షలంటే భయం వీడాలని తెలిపారు. చదివిన అంశాలు ఈజీగా గుర్తు పెట్టుకునేలా సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శంకర్‌, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల నలుగురి ఆత్మహత్య

రెంజల్‌(బోధన్‌): రెంజల్‌ మండలం తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన జంగం నవీన్‌ (36) జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. సోమవారం ఇంటి నుంచి వెళ్లిన నవీన్‌ గ్రామ సమీపంలోని పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతదేహాన్ని గుర్తించిన రైతులు కుటుంబీకులకు సమాచారం అందించారు. అక్కశోభ ఘటనా స్థలానికి చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేసింది. మూడు సంవత్సరాలుగా భార్యకు దూరమైన నవీన్‌ మద్యానికి బానిస కావడంతో ఆరోగ్యం క్షీణించి మతిస్థిమితం కోల్పోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్‌లోని జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధురాలు..

కమ్మర్‌పల్లి: అనారోగ్యంతో బాధపడుతూ ఓ వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన జల్లెండ్ల మల్లు(64) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్యహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మరణించింది. మృతురాలి కొడుకు అనిల్‌కుమార్‌ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పుల బాధతో ఒకరు..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన సాకలి మెత్కు సాయిలు(45) సోమవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. సాయిలు ఇటీవల కూతురు పెళ్లి చేయగా అప్పులు పెరిగిపోయాయి. దీంతో మద్యానికి బానిసైన సాయిలు తన చేను వద్ద ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య యశోద ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడు..

కామారెడ్డి క్రైం: రైలు కిందపడి గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలో సోమవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. వేకువజామున 1 గంటల ప్రాంతంలో రైల్వేస్టేషన్‌ యార్డు వద్ద పట్టాలపై ఓ గుర్తుతెలియని యువకుడి మృతదేహం పడి ఉండడాన్ని రైల్వే పోలీసులు గుర్తించి విచారణ చేపట్టారు. మృతుడి వయస్సు 25–30ఏళ్ల మధ్య ఉంటుందని, ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చని భావిస్తున్నారు. మృతుడు నలుపు రంగు కార్గో ప్యాంటు, తెలుపు రంగు టీషర్ట్‌ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. మృతుడి ఆనవాళ్లు తెలిసిన వారు ఎవరైనా ఉంటే కామారెడ్డి రైల్వే పోలీసులను సంప్రదించాలని తెలిపారు.